క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కర్నూలు కల్చరల్: ఎన్‌సీసీ 9 (ఎ) బాలికల పటాలం ఆధ్వర్యంలో ఆదివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీలో ఎన్‌సీసీ సీనియర్ వింగ్ క్యాడెట్స్, ఎన్‌సీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు 21 మంది, ఎస్టీబీసీ కళాశాల క్యాడెట్లు 3, ఉద్యోగులు 6 మంది రక్తదానం చేశారు. సిల్వర్ జూబ్లీ కళాశాల క్యాడెట్లు అంబేడ్కర్ విగ్రహం, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఎన్‌సీసీ 9 (ఎ) బాలికల పటాలం కమాండింగ్ అధికారి కల్నల్ జోబీ ఫిలిప్ మాట్లాడుతూ.. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గ్రూప్ కమాండర్ కల్నల్ ఎన్.రమేష్ రక్తదాతలను అభినందించారు. లెఫ్టినెంట్ సునీత, రోజమ్మ, ఆర్మీ అధికారులు, సుబేదారు రహమత్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవ్య

కల్లూరు: అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య స్పష్టం చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను జేసీ ఆదివారం పరిశీలించారు. ఓటు నమోదుకు సంబంధించిన వివరాలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అలాగే కల్లూరు అర్బన్ పరిధిలోని 59, 60, 61, 62, 65, 66, 67, 68, 69, 119, 120, 121 పోలింగ్ కేంద్రాలలో ఓటు నమోదు తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ నవ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు కీలకమన్నారు. 18 ఏళ్లు నిండిన వారి పేర్లను కొత్తగా ఓటరు జాబితాల్లో నమోదు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఓటు నమోదుతో పాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 26వ తేదీన కార్మిక, రైతు సంఘాలు తలపెట్టిన ఆందోళనను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం కర్నూలులో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పెద్ద పార్కు, పాతబస్టాండ్, ఎస్‌బీఐ సర్కిల్, ఆర్ఎస్ రోడ్డు మీదుగా కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ నెల 26 మహాధర్నాలో భాగంగా జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు చంద్రశేఖర్, రామకృష్ణ, సాయిబాబా, నరసింహులు, ఈశ్వర్, రాము పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం తథ్యం



మాట్లాడుతున్న డీసీఓ శ్రీదేవి

కల్లూరు: విద్యార్థులు పట్టుదలతో ఇష్టంగా చదివితే విజయం వరిస్తుందని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, నీట్ అకాడమీలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, ఆర్ఐఓ గురువయ్య శెట్టి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ ఈ ఏడాది అకాడమీకి చెందిన 41 మంది విద్యార్థులకు ఐఐటీ/ఎన్ఐటీ వంటి ప్రముఖ కళాశాలలో సీట్లు సాధించారన్నారు. అదేవిధంగా 24 మంది ఎంబీబీఎస్, బీడీఎస్, ఏజీబీఎస్సీ సీట్లు సాధించారని గుర్తు చేశారు. ఆర్ఐఓ గురువయ్య శెట్టి మాట్లాడుతూ అకాడమీలో తక్కువ మౌలిక వసతులున్నా విద్యార్థులు శ్రమించి చదుతున్నారని అభినందించారు. అకాడమి విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు దీటుగా సీట్లు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ లింగేశ్వర్‌రెడ్డి అకాడమీకి రూ.6లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను విరాళంగా అందించారు.కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తాజా కూరగాయలు లభిస్తున్నాయి



ఈ చిత్రంలో కనిపించే దంపతులు ఎల్లప్ప, సుష్మ, వీరి ఇంటిపై దాదాపు 150 వెరైటీలతో పండ్లు, కూరగాయలు, తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, పూలు, ఔషధ మొక్కలు నాటుకున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు టెర్రస్ గార్డెన్‌లో పనిచేస్తారు. ఏడాదిన్నర క్రితం టెర్రస్ గార్డెన్‌కు శ్రీకారం చుట్టగా నేడు నందనవనంగా మారింది. కుటుంబానికి అవసరమైన అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు టెర్రస్‌లోనే పండించుకుంటున్నారు. గార్డెన్‌లో పని చేయడంతో మానసిక ఆనందం ఇస్తుందని ఎల్లప్ప చెప్పారు.

మానసిక ఆనందం పొందుతున్నాం



కుసుపాటి అంజనీదేవి, బుధవారపేట, కర్నూలు బుధవారపేటకు చెందిన ఈ మహిళ పేరు కుసుపాటి అంజనీదేవి, ఇంటి పైకప్పుపైన టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకున్నారు. రోజు ఉదయం 2 గంటలు, సాయంత్రం గంట ఇందులో పనిచేస్తూ మానసిక ఆనందం పొందుతున్నారు. దాదాపు 1000 చదరపు అడుగుల్లో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకోవడం విశేషం. ఇందులో 150కి పైగా మొక్కలు ఉన్నాయి. అన్నిరకాల ఆకుకూరలు, కూరగాయలు, పూలతో పాటు అంజూర, మల్బరీ, వాటర్ యాపిల్, జామ మొక్కలతో గార్డెన్‌లో పనిచేయడం వల్ల అమితమైన ఆనందం కలుగుతుంది. ఆలు, ఉల్లి మినహా ఇతర కూరగాయలన్నీ టెర్రస్‌పైనే పండించుకుంటున్నట్లు చెప్పారు.

టెర్రస్ గార్డెన్ నిర్వహణకు ప్రోత్సాహం



ఈ వ్యక్తి పేరు తోట హరికృష్ణ, కల్లూరు మండలం పెద్దటేకూరుకు చెందిన ఈయన కర్నూలులో టెర్రస్ గార్డెన్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్తకొత్త మొక్కలు పరిచయం చేయడంతో పాటు ఎటువంటి సమస్య ఏర్పడినా తక్షణం పరిష్కారాలను సూచిస్తారు. వాట్సాప్ గ్రూపులో.. మొక్కల్లో ఈ సమస్య ఉందని పోస్టు చేస్తే చాలు.. తక్షణం స్పందిస్తారు. గార్డెన్ అభివృద్ధికి అవసరమైన ఇన్‌పుట్స్, సాంకేతిక సహకారం అందిస్తారు. అలాగే టెర్రస్ గార్డెనర్‌లకు మట్టి, కోకోపీట్, వర్మీకంపోస్ట్, వేపపిండి, వేప చెక్క, చీడపీడల నివారణకు అవసరమైన కషాయాలు సరఫరా చేస్తుంటారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి టెర్రస్ గార్డెన్ అభివృద్ధికి విశేషంగా పాటుపడుతున్నారు.

భవనంపై పచ్చని తోట

- విస్తరిస్తున్న టెర్రస్ గార్డెనింగ్
- పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పూలు, ఔషధ మొక్కల పెంపకం
- కెమికల్స్ లేని తాజా కూరగాయలు, ఆకుకూరలతో ఆరోగ్యం
- కర్నూలులో టెర్రస్ గార్డెన్‌లో రాణిస్తున్న వెయ్యి మందికిపైగా మహిళలు
- ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు, ప్రతి నెలా సమావేశాలు



బుధవారపేటలో ఓ భవనంపై పెంచిన వివిధ రకాల మొక్కలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి మనిషి రోజుకు సగటున కనీసం 85 గ్రాముల పండ్లు, 75 గ్రాముల నుంచి 125 గ్రాముల వరకు ఆకుకూరలు, 85 గ్రాముల ఇతర కూరగాయలు, 85 గ్రాముల దుంపకూరలు తీసుకోవాలి. ఇలా తీసుకున్నపుడే శరీరానికి అవసరమైన పోషకాలు సమకూరుతాయి. మారుతున్న ఆహార అలవాట్ల నేపథ్యంలో ఆకుకూరలు, కూరగాయలకు రోజువారి ఆహారంలో చోటు తక్కువైంది. ఫలితంగా విటమిన్ లోపం ఏర్పడుతోంది. విటమిన్-ఏ లోపంతో రేచీకటి, ఐరన్ లోపంతో రక్తహీనత సమస్యలు వస్తాయి. దాదాపు సగం మంది మహిళలు పిల్లలు, యువత రక్తహీనతతో బాధపడుతున్నారు. విటమిన్-బీ లోపంతో ఆకలి మందగించడం, నోటి చివర పగుళ్లు, నాలుకపై పూత వస్తాయి. ఈ లోపాలు నివారించుకోవాలంటే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాల్సిన అవసరం ఉంది. నేడు అడ్డుగోలుగా కెమికల్స్ వాడిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల వాటిలోని కెమికల్స్ ప్రభావం వల్ల మరిన్ని ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ప్రజల ఆలోచన విధానంలో మార్పు వస్తోంది. కెమికల్స్‌తో పండించిన వాటి భారిన పడకుండా సొంతంగా కుటుంబానికి అవసరమైన ఆకుకూర లు, కూరగాయలు పండించుకోవడంపై దృష్టి సారి స్తున్నారు. ఇందులో మహిళల కృషి, పట్టుదల ఎక్కువగా ఉంటోంది. నగరాలు, పట్టణాల్లో పెరటితోట ల అభివృద్ధికి స్థలాల కొరత ఉంటోంది. దీంతో టెర్రస్ గార్డెన్ ద్వారా పచ్చదనం అభివృద్ధి చేసుకుంటున్నారు.

పనికి రాని వాటితో..

పనికి రాని ప్లాస్టిక్ టబ్బులు, పాత బకెట్‌లు, పెయింట్, పెరుగు డబ్బాలు, సిమెంటు తొట్లు, ప్లాస్టిక్ సంచులు తదితర వాటితో పట్టణ ప్రజలు టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇంటిపైనే కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లను పండించుకుంటున్నారు. నగరంలో వందలాది మందికి టెర్రస్ గార్డెన్ హాబీగా మారింది. ఉదయం గంట, సాయంత్రం గంట గార్డెన్‌లో పనిచేయడం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభిస్తోంది. అలాగే తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు అందతున్నాయి.

విస్తరిస్తున్న టెర్రస్ గార్డెనింగ్

కర్నూలు నగరంలో టెర్రస్ గార్డెనింగ్ విస్తరిస్తోంది. దాదాపు వెయ్యి మందికిపైగా భవనాలపై మొక్కలను సాగు చేస్తుండటం విశేషం. టెర్రస్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు కూడా ఉన్నాయి. వీటి ద్వారా ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సమష్టిగా మొక్కలు తెప్పించుకొని గార్డెన్లను తయారు చేసుకుంటున్నారు. ఆర్గానిక్ టెర్రస్ గార్డెనింగ్ కర్నూలు అనే వాట్సాప్ గ్రూపు టెర్రస్ గార్డెనింగ్‌ను విశేషంగా ప్రోత్సహిస్తోంది. 233 మందితో ఈ గ్రూపు ప్రాచుర్యంలో ఉంది. సిటీ టెర్రస్ గార్డెనర్స్ గ్రూపు కూడా కర్నూలుతో పాటు ప్రధాన నగరాలు, పట్టణాల్లో టెర్రస్ గార్డెన్‌ను ప్రోత్సహిస్తోంది. వాట్సాప్ గ్రూపుల్లో ఉన్నవారిలో 90 శాతం మంది టెర్రస్ గార్డెన్‌లో రాణిస్తుండటం విశేషం. ప్రతి నెల లేదా 2 నెలలకోసారి వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నవారందరూ సమావేశమై టెర్రస్ గార్డెన్‌లను మరింతగా ఎలా అభివృద్ధి చేసుకోవచ్చు. కొత్త మొక్కలు తెప్పించి పంపిణీ చేయడం, మొక్కలకు సోకే చీడలు, పీడల తదితర వాటిపై చర్చించి తగిన పరిష్కారాలు పొందుతున్నారు. గార్డెన్‌లలోని మొక్కలకు వర్మీకంపోస్ట్, చెరువు మట్టి, వేప చెక్క, వేప కషాయం వంటి వాటిని వినియోగిస్తారు. మొత్తంగా ఆరోగ్యవంతమైన పద్ధతులతో టెర్రస్ గార్డెన్‌లు అభివృద్ధి చెందుతున్నాయి.

కెమికల్స్ ప్రభావం లేకుండా కూరగాయలు, ఆకు కూరలు..

పట్టణంలో 100 శాతం ఆర్గానిక్ పద్ధతుల్లో టెర్రస్ గార్డెన్‌లు అభివృద్ధి చేసుకుంటున్నారు. అలాంటివారిలో 80 శాతం మంది బయటి కూరగాయలు, ఆకుకూరల వినియోగాన్ని బంద్ చేశారు. సొంతంగా పండించుకున్న వాటినే వినియోగిస్తుండటం విశేషం. దానిమ్మ, జామ, సీతాఫలం, స్టార్‌ఫ్రూట్స్, అంజీర వంటి పండ్ల మొక్కలు కూడా నాటుకున్నారు. కెమికల్స్ లేని ఆహారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను ఖండిస్తూ నవంబర్ 26వ తేదీన మహాప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు తిరుపాలు పిలుపునిచ్చారు. వారు ఆదివారం స్థానిక గోకారి భవన్‌లో మాట్లాడుతూ.. జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల కడుపు కొడుతోందని విమర్శించారు. అన్నదాతకు మద్దతు ధర లభించేలా చట్టం చేయాలని కోరితే తిరస్కరిస్తోందన్నారు. కార్మికులకు ఉన్న చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తేవడంతో బానిసలుగా బతకాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలో రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాటాల్లో భాగంగా నవంబర్ 26వ తేదీన అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో మహాప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నాయకులు రమేష్, విజయ్, వెంకటేష్, రంగస్వామి పాల్గొన్నారు.

ప్రియాంక విజయంపై హర్షం

కర్నూలు(సెంట్రల్): కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికలో ఎంపీగా గెలిచిన ప్రియాంకగాంధీకి కర్నూలు జిల్లా కమిటీ తరపున అభినందనలు తెలుపుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రియాంకా గాంధీ ఇందిరమ్మ ప్రతిరూపమని, త్వరలోనే ఆమె పార్లమెంట్‌లో అడుగుపెట్టడం దేశానికి ఎంతో మేలు చేసే అంశమని పేర్కొన్నారు.

రేపు రాజ్యాంగ దినోత్సవం

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ దినోత్సవం/ జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఈ నెల 26వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు నేషనల్ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వై.జయరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీన అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నేషనల్ లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. న్యాయవాదులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, పౌర, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా సర్వజన కార్తీక వనభోజన మహోత్సవం



స్వాముల వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని బొడ్డువానిపల్లె వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం సర్వజన కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిథులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, పుల్లారెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాములవారి చిత్రపటాలను బహూకరించి సత్కరించారు. ఆలయ తరుపున నూతనంగా రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు ఈశ్వరీయ విశ్వవిద్యాలయం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, జేసీబి అంజి, బ్రహ్మకుమారీ, బ్రహ్మకుమారులు రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

కర్నూలు (టౌన్): వచ్చే నెల 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌కు సంబంధించి అందరూ సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ ఎస్పీ జి.హుస్సేన్ పీరా సూచించారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లా కోర్టు కానిస్టేబుళ్లతో అడిషనల్ ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో వీలైన న్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. అధిక సంఖ్యలో కేసులు రాజీ కుదిరేలా న్యాయ శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఏదైనా కేసుల్లో నిందితులను అరెస్టు చేసేటప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టుల నియమ నిబంధనలు, విధి విధానాలు పాటించాలన్నారు. సీఐలు రామయ్యనాయుడు, పీపీలు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల చెల్లింపులపై పోరుబాట

- వచ్చే నెల 20, 21 తేదీల్లో ఏపీటీఎఫ్ జిల్లాస్థాయి ఆందోళనలు
- ప్రభుత్వం స్పందించకుంటే జనవరిలో రాష్ట్రస్థాయి ఉద్యమాలు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు

కర్నూలు సిటీ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఆర్థిక బకాయిల చెల్లింపులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ పోరుబాట పట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు తెలిపారు. ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ బకాయిలు రూ.22 వేల కోట్లు చెల్లిస్తామని ఎన్డీఏ కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు అవుతుందని, ఈ కాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర డిడక్షన్స్ రూపంలో రూ.2500 కోట్లు ప్రభుత్వానికి చేరిందని, కనీసం వాటినైనా దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయాలన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్స్, ఎన్కాష్మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీకి తక్షణమే కమిషనర్‌ను నియమించి, ఆ నివేదికను సమర్పించేలోగా, మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలన్నారు. రెండు కొత్త డీఏలు ప్రకటించాలని, పంచాయతీరాజ్ యాజమాన్యంలో నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియమాకాలను చేపట్టాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పాఠశాల విద్యలో ఉమ్మడి సర్వీసు రూల్స్ ఉత్తర్వులు 72, 73, 74 అమలు చేస్తూ జూనియర్ కాలేజ్, డైట్ కాలేజీల అధ్యాపకులు, ఉపవిద్యాధికారులు, ప్రిన్సిపల్స్ పదోన్నతులు చేపట్టాలన్నారు. స్కూళ్ల సమయ పాలన పాత వేళలను కొనసాగించాలన్నారు. తమ ఈ డిమాండ్లపై వచ్చే నెల 20, 21 తేదీల్లో అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్ర స్థాయి ఆందోళనలు చేస్తామన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మారియానందం, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ నాయకులు టి.వి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలోని సమస్యలపై అర్జీల రూపంలో కార్యాలయంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

ఉలిందకొండలో ఉచిత వైద్య శిబిరం

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకుడు ధనుంజయ్య ఆచారి ఆధ్వర్యంలో తన తండ్రి భీమశేషయ్య వర్ధంతి సందర్భంగా కర్నూలు కిమ్స్ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుండె వ్యాధికి సంబంధించిన ఈసీజి, 2డీఏఓ, మధుమేహం తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సామాజిక నాయకులు మహబూబ్ బాషా, నాగేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో బీసీ హాస్టళ్ల అభివృద్ధి



ఎంపీ బస్తిపాటి నాగరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ సంక్షేమ అధికారులు

కర్నూలు అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు రూ.కోటి నిధులు కేటాయించారు. తన పార్లమెంటు నిధుల నుంచి కోటి రూపాయలు హాస్టళ్ల అభివృద్ధికి కేటాయించడం పట్ల బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఆదివారం రాత్రి ఎంపీని ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో జిల్లా బీసీ సంక్షేమం సాధికారత అధికారిణి టి.వెంకటలక్ష్మమ్మ, సహాయ బీసీ సంక్షేమ అధికారులు ఎం.శ్రీనివాసులు, ఆంజనేయులు నాయక్, వసతి గృహ సంక్షేమ అధికారులు గిరిజారెడ్డి, శారదమ్మ, శంకర్, మహాలక్ష్మీ, కనకలత, ప్రసన్నకుమార్, శైలజా తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో సమస్యలను పరిష్కరించండి



కూరగాయల మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని కూరగాయల మార్కెట్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిక శ్రేణి సెక్రటరీ జయలక్ష్మి ఆదేశించారు. ఆమె ఆదివారం కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేశారు. ట్రాఫిక్ సమస్యలను, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. కూరగాయల మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా కూరగాయల మార్కెట్‌లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటికి తరలించాలన్నారు. వ్యాపారులు తమ షాపుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ కేశవరెడ్డి ఉన్నారు.

జీసీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియమాక పత్రాలు అందిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: ప్రభుత్వ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ)కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ఆ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియకు ఎన్నికల అధికారిగా రిటైర్డ్ అధ్యాపకులు సి.రమేష్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ డాలు నాగన్న (కామర్స్ లెక్చరర్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ), కార్యదర్శిగా డాక్టర్ దళవాయి శ్రీనివాసులు (కామర్స్ లెక్చరర్, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ), మహిళా కార్యదర్శిగా ఏ.జయలక్ష్మీ (హిస్టరీ అధ్యాపకురాలు, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ), కోశాధికారిగా డాక్టర్ జి.పాల్ దేవదానం (ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఎమ్మిగనూరు) ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో మొత్తం 73 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా ఎస్.వెంకటకృష్ణయ్య వ్యవహరించారు.

హాస్యంతో సంపూర్ణ ఆరోగ్యం



జబర్దస్త్ కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: హాస్యం టానిక్ లాంటిది, ఆరోగ్యాన్నిస్తుందని కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం జబర్దస్త్ కళాకారులు హాస్య కిట్స్ ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా టీజీవీ కళాక్షేత్రం ఎన్నో గొప్ప సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రేక్షకులను అలరిస్తోందన్నారు. అనంతరం కళాకారులు అప్పారావు, వినోదిని, గుండు మురళీధర్, నవీన్, అర్జున్, ఎస్ఆర్ఎస్ ప్రసాద్ ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ అలరించాయి. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, కళాక్షేత్రం సభ్యులు ఇనాయతుల్లా, బాల వెంకటేశ్వర్లు, రాముడు, శ్రీనివాసరెడ్డి, క్రిష్టఫర్, యాగంటీశ్వరప్ప పాల్గొన్నారు. కార్యక్రమ కన్వీనర్లు సంగా ఆంజనేయులు, లక్ష్మీకాంతరావు వ్యవహరించారు.

ఓటరు శిబిరం పరిశీలన



ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ వద్ద ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్, జొహరాపురం మున్సిపల్ స్కూళ్లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మర్ రివిజన్-2025 లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

పారిశుధ్య చర్యలపై దృష్టి

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. ఆదివారం స్థానిక వీకర్ సెక్షన్ కాలనీ, కొత్తబస్టాండ్ వెనుక కాలనీలను మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డితో కలిసి పరిశీలించారు. స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది మురుగు కాల్వలు, రోడ్లు ఊడ్చడం వంటి పనులు క్రమం తప్పకుండా పాటించాలన్నారు. అక్కడి పార్కు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో కమిషనర్ పరిశీలించారు. పార్కును శుభ్రం చేయించారు. అక్కడి వారిని బయటకు పంపి పార్కుకు తాళం వేశారు.

నడకతో ఆరోగ్య ప్రయోజనాలు



డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌ను సన్మానిస్తున్న ఆరోగ్యభారతి సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): క్రమబద్ధమైన, ఆరోగ్యకరమైన జీవనం గడిపేందుకు, సదా పదికాలాల పాటు ఆరోగ్యంగా బతకాలంటే మనిషికి నడక.. నడత చాలా ముఖ్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. శ్రీ ధన్వంతరి జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నడకతో ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. భగవాన్ ధన్వంతరిని పూలమాలలతో పూజించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాక్ ఫర్ హెల్త్‌ను జెండా ఊపి ప్రారంభించారు. పాతబస్టాండ్ నుంచి కోట్ల సర్కిల్, కిడ్స్ వరల్డ్ మీదుగా రాజవిహార్ వద్ద వివేకానంద సర్కిల్ వరకు వెళ్లి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు అలంకరించి తిరిగి గాంధీనగర్ మీదుగా పాత బస్టాండ్ చేరుకున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజుకు గంట పాటు నడవాలని సూచించారు. అనంతరం వాసవి కాలేజీలో ఉచిత దంత వైద్యశిబిరం, కల్లూరులోని ఆదిత్య స్కూల్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్యభారతి క్షేత్ర సంఘటనా మంత్రి ఎ.కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి ఎండీవీఎస్. రామశర్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి.మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.